


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# 130

(23' ఫిబ్రవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**పురుషుడు** అభివృద్ధిలోనికి రావడానికి ఉన్నత పదవులు అలంకరించడానికి మేథస్సును దశ దిశల వెదజల్లడానికీ, అర్ధాంగి ఆలంబన అవుతుందా? అవరోధమవుతుందా? అనే ప్రశ్నలు బయలుదేరుతూ వుంటాయి.

అవరోధం మాట ఎలా వున్నా కొంతమంది మగువలు భర్తల పట్ల విధేయత ప్రకటిస్తూ, వారి ఆశయాలే తమ ఆశయాలుగా భావించి వాటిని ఫలవంతం చేయడానికి కృషిచేస్తూ వుంటారు.

చాలామంది అనుకుంటూ వుంటారు "పెళ్ళి అయిన తరువాత కాలికీ, చేతులకు ఇంకా దేవుడు మేలుచేస్తే నోటికీ సంకెళ్ళు పడ్డట్టే. జీవితంలో పెళ్ళినాటికి ఏ మెట్టుమీద ఉన్నాడో ఆ మెట్టుమీద 'తుమ్మెండా' పెట్టినట్లు కూర్చోవడం తప్ప ఒక మెట్టు పైకెక్కడం మాత్రం అబద్దం. అక్కడనుంచీ దిగజారకుండావుంటే అంతే చాలు" అనుకుని నిరాశచెందుతూ ఉంటారు.

కావాలని ఒక కన్నెమిన్నను వెతుక్కుని కల్యాణం చేసుకుని, కమ్మటి జీవితం గడపడానికి బదులు అంతవరకూ తన జీవితం వేగంగా పరుగెత్తడానికి వేయబడిన రైలు పట్టాలు తీసివేసినట్లు, కొద్ది దూరంలో వున్న వంతెన పడగొట్టి ముందుకు వెళ్ళకుండా ఆపివేసినట్లు భావించి చింతాక్రాంతులవుతూ వుంటారు కొంతమంది.

ఈ కాలంలో వారు చాలామంది దాంపత్య స్థితిలో అడుగు పెట్టడానికి భయపడుతున్నారు. ఇంకా పెద్ద చదువులు చదవాలనేది ఒక కోర్కె. ఆర్థికంగా నిలబడలేకపోతామనేది ఒక భయం. ఈ మధ్య ఒక యువకుడు వివాహం చేసుకుంటే విదేశాలకు వెళ్ళే అవకాశం వుండదు. కనుక సంబంధాలు వెతకవద్దు నాకోసం. అని గట్టిగా తల్లిదండ్రులకు చెప్పి వేశాడు.

ఈ వయసులో విదేశాలకు వెడితే వంటరిగా తిరిగి వస్తాడా? ఏ జాతి కోడలు వస్తుందో ఎలాంటి ఖ్యాతి తెస్తుందోనని తల్లిదండ్రులు తల్లక్రిందులుగా ఆలోచించడం తప్పడంలేదు.

ఇదివరలో పెద్దలు వివాహం వల్ల విద్య నాశనమవుతుందనేవారు. ఇప్పుడు చదువుమాట అలావుంచి, పిల్లవాడెక్కడ పాడైపోతాడోనన్న భయంతో వీలైనంత త్వరలో పెళ్ళిళ్ళు చెయ్యాలని తొందరపడుతున్నారు. కానీ వాళ్ళ పప్పులు ఉడకడంలేదు. దయతలచి కూతుళ్ళు 'పితృభక్తి' అనే సోడా ఉప్పు అందులో వెయ్యడం లేదు. అందువల్ల కొందరు మగపిల్లలకు ఏ నలభయ్యో పడో దగ్గర పడిన తర్వాత గాని వివాహకాండ పొడ చూపడంలేదు. మొన్న ఇలాంటి పెళ్ళికొడుకొకడు కలకత్తా నుంచి తల్లిదండ్రులకు ఉత్తరం వ్రాశాడుట. మీరోడజను మందిని రెడీగా పెడితే నేవచ్చి ఏదో ఒకటి సెలక్టు చేసుకుంటాను. మూడురోజులకంటే సెలవు ఎక్కువ దొరకదు' అని. ఇలాంటి సందర్భాలలో సంత బేరాలు జ్ఞాపకం రాకమానవు.

జీవితంలో విజయం సాధించాలంటే, ఉద్యోగం ముఖ్యమా? వివాహం ముఖ్యమా అనే సమస్యమీద అమెరికాలో కొంత పరిశోధన జరిగింది. డాక్టర్ జీన్‌బర్గ్ అనే ఆయన ఆలోచించి ఆలోచించి "రెండూ ముఖ్యమే"నని వాదనలోనుంచి చల్లగా బయటపడ్డాడు.

అయితే, అది ఆయన వూహించి చెప్పిన మాటకాదు. ప్రతిభావంతులైన మూడు వందలమంది విద్యార్థుల్ని కలుసుకుని, వారి అభిమతాలు తెలుసుకుని చెప్పిన మాటది. ఉన్నత స్థాయిలో ఉన్నవారందరూ వయసు ముదిరి ఎండు సొరకాయలు కాక ముందే వివాహమాడడానికి నిశ్చయించుకొన్నారు. అలాగే దాంపత్య జీవితంలో అడుగు పెట్టారుట. వీరందరూ ఇరవైమూడు సంవత్సరాలు దాటకముందే గృహస్థులై కమ్మటి జీవితాలు గడుపుతున్నారుట. అయితే, బ్రహ్మచారులుగా వున్నవారు పైకిరారా? అనే ప్రశ్న వేస్తే, అసలు రారని కాదుగాని, అలా వచ్చినవారు బహుకొద్ది మందని తేల్చాడు డా. జీన్ బర్గ్. ఇంతకు చెప్పవచ్చిందేమంటే వైవాహిక జీవితం పురుషుడు ఉన్నత స్థితికి వెళ్ళడానికి ఎంతమాత్రం అడ్డురాదని ఈ పరిశోధనలవల్ల తేలింది. అయితే, దేశంలో చాలామంది భార్యను చూచి "నిన్ను చేసుకోవడంవల్ల జీవితమిలా నీళ్ళుకారిపోయింది. లేకపోతే ఎంత ఉచ్చస్థితిలో వుండేవాణ్ణో, భార్యవుకావు నువ్వు మెడలో గుదిబండవు" అని దుమ్మెత్తి పోసేవారు లేకపోలేదు.

అయినా ఈ సమస్య వ్యక్తిగతంగా తేల్చి చెప్పుకోవలసిందేగానీ, మూకుమ్మడిగా ఆలోచించి ఒక నిర్ణయానికి రావడం కష్టం. కొందరు పెద్ద హోదాలో ఉన్నవారు "నా అర్ధాంగి సహకారం, ప్రోత్సాహం, పోషణా లేకపోతే నేనీస్థితిలో ఉండేవాణ్ణికాదు. ఈ సత్యం బయటపెట్టడంలో నేను సిగ్గుపడవలసిన పని ఎంతమాత్రం లేదు" అంటూ వుంటారు. బహిరంగ సభల్లో సైతం.

చిన్నతనంలో బాధ్యతలన్నింటినీ విస్మరించి చేస్తున్న ఉద్యోగం కూడా మాని, బికారిగా మారిపోయిన ఒక ఉద్యోగి తర్వాత డాక్టరేటు బిరుదు సంపాదించి ఇలా చెప్పుకున్నాడు. "మా ఆవిడ నన్ను తిరిగి ఉద్యోగంలో చేర్పించింది. దానికోసం ఆవిడ చేసిన కృషి, చూపించిన ఆదుర్దా వర్ణించలేను. అక్కడితో వూరుకోలేదు. నేను డాక్టరేటు బిరుదు సంపాదించేదాకా నిద్రపోలేదు" అని.

ఒక గొప్ప పారిశ్రామికవేత్త తన దాంపత్య జీవితాన్ని గురించి సంతోషంగా ఇలా చెప్పుకున్నారు. " గార్హస్త్య జీవితం నా ఉద్యోగ జీవితాన్ని ఎంతో ఉత్తేజపరిచింది. విజయ సోపానాలనెక్కి పోవడానికి ఎంతో తోడ్పడింది. అంతేకాదు, నా సంతానానికి నేనొక ఆదర్శమూర్తిగా నిలిచే అవకాశం కల్పించింది. ఈ అన్నింటిలో తోడ్పడిన నా అర్ధాంగిని నేనెలా కొనియాడాలో తెలియడంలేదు.

మొదట్లో చెప్పినట్లు ఈ కాలంలో దాంపత్య జీవితాలు సుఖంగా సాగాలంటే ధనం ముఖ్యమైంది. అందువల్ల చాలామంది 'సంపాదించే భార్యకావాలి' అని గట్టిగా చెబుతున్నారు. ఇద్దరూ సంపాదిస్తేగానీ నవ్వుతూ కాలెండరు కాగితాలు చించడానికి వీలులేకుండా వుంది. ఏదో చన్నీళ్ళకి వేన్నీళ్ళు నూటిపైన పదహారు అనుకుంటూ వుంటారు.

ఇలాంటివారి విషయం ఆలోచించినప్పుడు 'అర్ధాంగులు' అనే మాటలో ఎంతో సత్యం గోచరిస్తుంది. 'అర్ధం'లో కూడా భాగస్వాములు అవుతున్నారు గనుక. ఒక గొప్ప విజ్ఞానశాస్త్రవేత్త తన జీవిత చరిత్ర రాస్తూ, 'నా భార్య కూడా ఉద్యోగం చేయడం వల్ల నేను నా కొద్ది జీతంతో పరిశోధన చేయగలిగాను. నా భార్య సంపాదించకపోతే నేను పరిశోధనలకు స్వస్తి చెప్పి ఇంకెక్కడన్నా పదిరాళ్ళు ఎక్కువ దొరుకుతాయేమోనని పరుగెత్తవలసి వచ్చేది' అని ఆమెకు కృతజ్ఞత తెలుపుకున్నారు.

అయితే, భార్యల మూలంగా బాధలు పడ్డవాళ్ళు పదవులు సరిగ్గా నిర్వహించలేక పల్టీలు కొట్టినవాళ్ళు చాలామంది వున్నారు. ఒక విద్యాశాఖాధికారి తప్పనిసరిగా బయటపడి తన భార్యను గురించి ఇలా చెప్పుకోక తప్పలేదు.

"ఆవిడ నన్ను ఒక గంట స్వతంత్రంగా వుండనిచ్చేదికాదు. అవతల ఉద్యోగం ఉందని ఎంత మొత్తుకున్నా వినకుండా నా గతి ఏమిటో చెప్పి అవతల అడుగువెయ్యండని గొడవ చేసేది. అందువల్ల ఉద్యోగంలో చెడ్డపేరు తెచ్చుకొనక తప్పలేదు"

ప్రపంచఖ్యాతి చెందినవారు చాలామంది గయ్యాళి భార్యలతో పడరాని ఇక్కట్లు పడ్డారు.

Post your comments